www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్
02 నవంబర్ 2025
సంపుటి:3 సంచిక: 305

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## ప్రీమియం ఇళ్లకు గోల్డెన్ డేస్

ధరలు 12% పెరుగుదల
హైదరాబాద్ రియల్ ఎస్టేట్ 2025 డిమాండ్

06




## సారీ మరోసారి!

- కాంగ్రెస్ మంత్రివర్గ విస్తరణ చేపట్టింది
- అజారుద్దీన్ కు కేబినెట్ లోకి తీసుకుంది
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు హస్తం చూపించింది
- ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి మంత్రి పదవి ఆశించారు
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కూడా నిరాశే
- వీరిలో రాజగోపాల్ రెడ్డి కూడా ఉన్నారు
- కానీ ప్రభుత్వ సలహాదారుగా నియమించింది
- కేబినెట్‌లో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది

02







## బీజేపీ, బీఆర్ఎస్ ది ఫెవికాల్ బంధం

- ఊపందుకున్న జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం
- బోరబండ కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ హయాంలో మహిళలకు అన్యాయం
- సీతక్క,కొండా సురేఖలకు మంత్రి పదవులు ఇచ్చాం
- మాట ప్రకారం అజారుద్దీన్‌ని మంత్రిని చేశాను
- సొంత చెల్లెలిని ఇంటి నుంచి పంపించేశారు
- నవీన్‌ను 30 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించండి
- వందల కోట్లతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాను

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బోరబండలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉచిత బస్సు రద్దు చేయాలని బీఆర్ఎస్‌వాళ్లు మాట్లాడుతున్నారని.. ఇది వాళ్ల 'గలీజ్ బుద్ధి' అని విమర్శించారు. మహిళలకు మంత్రి పదవులు ఇవ్వని బీఆర్ఎస్‌కు భిన్నంగా.. తమ ప్రభుత్వంలో సీతక్క, కొండా సురేఖలకు మంత్రి పదవులు ఇచ్చామని చెప్పారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌ను మంత్రిని చేసి, జూబ్లీహిల్స్ ప్రజల ముందుకు తీసుకువచ్చానని ప్రకటించారు. ఈ ప్రాంత అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

గత ఎన్నికల్లో అజారుద్దీన్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తామని మాట ఇచ్చామని.. ఆ మాట నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'జూబ్లీహిల్స్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌ను మంత్రి పదవి ఇచ్చి మీ ముందుకు తీసుకొచ్చా' అని పేర్కొన్నారు. కారు షెడ్డుకు పోయిందని, ఇప్పుడు బిల్లా రంగాలు

**మిగతా 2లో..**

# ప్రాణాలు హరించిన శ్రీహరి..!



- శ్రీకాకుళం జిల్లాలో ఘోర విషాదం జరిగింది
- కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట
- 12 మంది భక్తులు అక్కడికక్కడే దుర్మరణం
- ఘటనపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు విచారం
- పలువురి పరిస్థితి విషమంగా ఉంది
- ఉత్తరాంధ్ర చిన్న తిరుపతిలా ఆలయానికి ప్రచారం
- ఏకాదశి నేపథ్యంలో ఆలయానికి 25వేల మంది భక్తులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

శ్రీకాకుళం జిల్లాలో ఘోర విషాదం జరిగింది. కాశీబుగ్గ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం తొక్కిసలాట జరిగింది. ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో 12 మంది భక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. క్షతగాత్రుల్లో

**మిగతా 2లో..**



## 'పిడికిలి బిగించి.. ఉద్యమించాలి'

- కరీంనగర్‌లో జనం జాగృతి జనంబాట
- కీలక వ్యాఖ్యలు చేసిన కల్వకుంట్ల కవిత
- నేను ఎవరి బాణం కాదన్నారు
- రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఉంది
- బీజేపీ, బీఆర్ఎస్ ప్రజల కోసం తిరగటం లేదు
- బీఆర్ఎస్ చేయాల్సినంత పోరాటం చేయలేదు
- మోడీ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు

02



## తెలంగాణను ఎకో టూరిజం హబ్ చేస్తాం

- నర్సాపూర్‌లో మంత్రి కొండా సురేఖ పర్యటన
- అడవులను ప్రకృతి ప్రేమికులు నచ్చేలా తీర్చిదిద్దాం
- ఎకో పార్క్, కాటేజీలను ఆమె ప్రారంభించారు
- నగరాలన్నీ కాలుష్యం బారిన పడుతున్నాయి
- 4,300 ఎకరాలలో జిల్లా అటవీ విస్తీర్ణం
- 600 ఎకరాలలో నర్సాపూర్ అర్బన్ ఎకో పార్కు

02

## మూడు ఫీట్లుంటవ్ నువ్వెంత



- హాట్ టాపిక్‌గా జూబ్లీహిల్స్ రాజకీయాలు
- ప్రధాన పార్టీలు ప్రచారం జోరును పెంచాయి
- పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి
- కేటీఆర్ మరోసారి రేవంత్ రెడ్డిపై పంచ్‌లు వేశారు
- తెలంగాణలో ఆహా నా పెళ్ళంట సినిమా కథ
- కేటీఆర్ సమక్షంలో పలువురు పార్టీలో చేరారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు తెలంగాణలో హాట్ టాపిక్ గా మారాయి. అన్ని ప్రధాన పార్టీలు ప్రచారం జోరును పెంచాయి. ఇప్పటికే వివిధ పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఒకరిపై మరోకరు ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ల మధ్య చీకటి ఒప్పందం కుదిరిందని బీజేపీ ఆరోపణలు చేస్తుంది. అదే విధంగా కాంగ్రెస్, బీజేపీలది బడేమియ్యా, ఛోటేమియ్యా బంధం అంటూ బీఆర్ఎస్ ఏపీపా రేస్తుంది. జూబ్లీహిల్స్ లో ఎలాగైన తమ పార్టీ జెండా ఎగురవేయాలి అన్ని ప్రధాన

**మిగతా 5లో..**

## హోం మినిస్టర్‌గా అజారుద్దీన్..!

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వేడి
- గెలుపు అజెండాతో బరిలో దిగిన హస్తం
- అజారుద్దీన్‌కు కేబినెట్ లోకి తీసుకుంది
- జూబ్లీహిల్స్ టికెట్ కోసం తీవ్రంగా శ్రమించారు
- అజారుద్దీన్ గత ఎన్నికల్లో ఓడిపోయారు
- ఆయనకు శాఖలు కేటాయిస్తారని ప్రచారం
- హోంశాఖ బాధ్యతలు అప్పగిస్తారనే టాక్



02

## ట్రై సిటీ సో పిటీ..!



- రాష్ట్రంలో రెండో అతిపెద్ద మహనగరం వరంగల్
- ఓరుగల్లును రెండో రాజధానిగా పిలుస్తారు
- అయితే పరిస్థితులు అస్సలు బాగోలేవు
- గట్టిగా ఓ వర్షం పడితే మొత్తం మునిగే పరిస్థితి
- రోడ్లు చెరువుల్లా మారిపోతున్నాయ్
- ట్రై సిటీగా కాజీపేట, హన్మకొండ, వరంగల్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో రెండో అతిపెద్ద మహానగరం వరంగల్. హైదరాబాద్ తర్వాత.. రెండో రాజధానిగా పిలిచే ఓరుగల్లులో.. పరిస్థితులు అస్సలు బాగోలేవు. గట్టిగా ఓ వర్షం పడితే.. ఇళ్లలో నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది. బయటే ఉంటే.. ఇంటికి చేరుకునే మార్గం కనుమరుగయ్యే దుస్థితి ఉంది. భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా వరంగల్ ఎందుకు మునిగిపోతోంది? అక్కడెక్కడో ఆంధ్రప్రదేశ్ తీరంలో తుపాను వచ్చినా.. ఇక్కడ వరదలు ఎందుకొస్తున్నాయి? వరంగల్.. పేరుకే ట్రై సిటీ. వానొస్తే చాలు.. నగరమంతా సో పిటీగా మారిపోతోంది. అంతా.. ఇంతా అని కాదు.. ఎన్ని సెంటీమీటర్ల వర్షం కురిసినా.. వరంగల్‌లో సెంటీమీటర్ ఖాళీ లేకుండా తడిసిపోతోంది. కాజీపేట అయినా, హన్మకొండ అయినా, కోర్ వరంగల్ నగరమైనా.. ఎక్కడ చూసినా రోడ్లు చెరువుల్లా మారిపోతున్నాయ్. ఇళ్లలోకి చేరుతున్న వరద నీరు..

**మిగతా 5లో..**

# తెలంగాణను ఎకో టూరిజం హబ్ చేస్తాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణను ఎకో టూరిజం హబ్ చేస్తామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. హైదరాబాద్ మహా నగరానికి అతి సమీపంలో ఉన్న నర్సాపూర్ అడవులను ప్రకృతి ప్రేమికులతో పాటు పర్యాటకులకు నచ్చేలా అర్బన్ ఎకో పార్క్ ను తీర్చిదిద్దామన్నారు. శనివారం ఆమె నర్సాపూర్ నియోజకవర్గంలో ఎకో పార్క్, కాటేజీల ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. పర్యాటకులను మరింతగా ఆకట్టుకోవడంతో పాటు ప్రముఖ పర్యాటక కేంద్రంగా నర్సాపూర్ అడవులను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం అర్బన్ ఎకో పార్కులో అధునాతన సౌకర్యాలతో కాటేజీల నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. అటవీ శాఖ,ప్రైవేటు భాగస్వామ్యంతో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. హైదరాబాద్‌మెదక్ జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఈ అటవీ ప్రాంతాన్ని మరింత డెవలప్ చేయబోతున్నట్లు తెలిపారు. నర్సాపూర్‌కు ఎవరు వచ్చినా ...అర్బన్ ఎకో పార్కును సందర్శించి అక్కడి పరిసరాలు, ప్రకృతి అందాలను తనివితీరా ఆస్వాదించేలా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇక్కడ వాచ్‌టవర్ అందరినీ ఆకట్టుకుంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వాచ్‌టవర్ ఎక్కి అటవీ ప్రాంతం అంతా చూడటం ఓ గొప్ప అనుభూతిగా ఉంటుదన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలో ఉన్న ప్రైవేట్ కాటేజీలను తలదన్నేలా ఇక్కడ అర్బన్ ఎకో పార్కులో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

ఇక ప్రస్తుతం నగరాలన్నీ కాలుష్యం బారిన పడుతున్నాయి, ఈ నేపథ్యంలో పచ్చదనం కాపాడేందుకు ఎకో పార్కులను మెరుగుపరచడం, మరింత అభివృద్ధి చేయడం అనివార్యంగా మారిందని మంత్రి వివరించారు. గతంలో మన మానవ జీవన విధానం అడవుల్లోనే ప్రారంభమైందని, ఇప్పుడు పట్టణీకరణ పేరుతో పెరిగిన కాలుష్యం కారణంగా--- ప్రజలంతా మళ్ళీ అడవుల వైపు చూస్తున్నారన్నారు. అందుకే తమ ప్రభుత్వం అర్బన్ ఎకో పార్కు అభివృద్ధి పరిచిందన్నారు. ప్రస్తుత యాంత్రీకరణ జీవన విధానంలో వారంతంలో ఒక్కసారైన కుటుంబం ఇలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు అర్బన్ ఎకో పార్క్ లో అన్నీ సౌకర్యాలు ఉన్నాయన్నారు. అయితే కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు అడవులను ఫోన్‌లలో, ఇన్‌స్టాగ్రాం రీల్స్ లో చూపుతున్నారని, దీనంత దారుణం మరొకటి లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ కళ్లముందు సహజ సిద్ధంగా సాక్షాత్కరిస్తే అద్భుతంగా ఉంటుందని వివరించారు. అందుకే అర్బన్ ఎకో పార్కులను అటవీ శాఖ ఏర్పాటు చేసిందన్నారు. పర్యాటక పరంగా నర్సాపూర్ మరింత అభివృద్ధి చెందనుందని, ఇప్పటికే అర్బన్ పార్కుకు సందర్శకుల తాకిడి పెరిగిందని అధికారులు చెబుతున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ ఎకో పార్క్ లో పాత కాటేజీల పనులు పూర్తి చేయడంతో పాటు కొత్తగా మరిన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతంలో 21 కాటేజీలు, ఒకే బ్లాక్‌లో ఉండే విధంగా మరో 12 కాటేజీలు, ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్, సెమినార్ హాల్, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్, నెట్ క్రికెట్‌తో పాటు స్విమ్మింగ్ పూల్, పర్యాటకులకు భోజన సదుపాయం కల్పించేందుకు రెస్టారెంట్, దానిని ఆనుకొని కిచెన్ నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు .అంతేగాక కాటేజీల పరిసరాల్లో అక్కడక్కడ ఖాళీ స్థలంతో పాటు కొంత ఏరియాలో మొక్కలు నాటామన్నారు. 4,300 ఎకరాలలో జిల్లా అటవీ విస్తీర్ణం ఉండగా 600 ఎకరాలలో నర్సాపూర్ అర్బన్ ఎకో పార్కు, ఆఫీసర్స్ గెస్ట్‌హౌజ్, పర్యాటకుల కాటేజీలు, రిసెప్షన్ సెంటర్స్, కిచెన్ కం స్టోరేజీ తదితర వసతులను మెరుగుపరుస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# 'పిడికిలి బిగించి.. ఉద్యమించాలి'

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కరీంనగర్ లో నిర్వహించిన జాగృతి జనంబాట కార్యక్రమంలో కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎవరి బాణం కాదన్న ఆమె.. తెలంగాణ ప్రజల బాణాన్ని అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఉందన్న కవిత.. కొన్ని పార్టీలను నమ్ముకొని దగా పడ్డామని ప్రజలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. తమ ప్రాధాన్యత ప్రజల సమస్యలు తీర్చటమేనని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం అన్ని పార్టీలు బిజీగా ఉన్నాయని.. మొంథా తుపానుతో దెబ్బతిన్న రైతులను పట్టించుకోవడం లేదని కవిత మండిపడ్డారు.

వరంగల్ నగరమంతా నీటిలో మునిగితే పోరాటం చేయాల్సి పార్టీలు పట్టించుకోవడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్ అయ్యారు. 'రెండు విపక్షాలు (బీజేపీ, బీఆర్ఎస్) ప్రజల కోసం తిరగటం లేదు. వాళ్ల తరపున మేము పోరాటం చేస్తాం. జాగృతి రాజకీయ వేదికే. మేము చాలా సందర్భాల్లో రాజకీయాలు మాట్లాడాం. మోడీ కార్మికుల హక్కులను కాలరాస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ లు చేయాల్సినంత పోరాటం చేయలేదు. రైతు చట్టాల గురించి మాట్లాడిన రాహుల్ గాంధీ.. లేబర్ చట్టాల గురించి మాట్లాడలేదు. రైతు చట్టాలు మారాయి. కానీ కార్మికులకు అన్యాయం చేసే చట్టాల విషయంలో మార్పు రాలేదు' అని కవిత అన్నారు.

**'నావల్లే.. రూ.700 కోట్లు ఇచ్చారు'**

లోకల్ బాడీ ఎన్నికల సమయంలోనే ఏం చేయాలన్నది నిర్ణయం తీసుకుంటామని కల్వ



కుంట్ల కవిత అన్నారు. 'పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ ఇంకా రెండు నెలల సమయం కోరుతున్నారు. అంటే వాళ్లు ఈ విషయాన్ని ఇంకా సాగదీసే ప్రయత్నంలో ఉన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మాకు ఎలాంటి స్టాండ్ లేదు. ఫీజు రీయింబర్స్ మెంట్ కు సంబంధించి మండలిలో లో నేను మాట్లాడితేనే సీఎం రూ.700 కోట్లు ఇచ్చారు. ప్రతి నెల నిధులు విడుదల చేస్తామని చెప్పి చేయటం లేదు. స్కూల్స్, కాలేజ్ యాజమాన్యాలు ఆందోళన చేస్తే వారికి మద్దతుగా ఉంటాం. స్కూల్స్ బంద్ కాకుండా పోరాటం చేస్తాం. లేదంటే చదువుకునే ఆడపిల్లలే నష్టపోతారు. ఏపీకి 23 మంది సీఎంలు అయితే ఒక్క బీసీ గానీ, మహిళ గానీ ఎందుకు సీఎం కాలేదు?. అన్ని ప్రాంతాలు తిరిగి ప్రజల అభిప్రాయం తీసుకొని కార్యాచరణ తీసుకుంటాం' అని కవిత అన్నారు.

'నన్ను వారి బాణం, వీరి బాణం అని అంటున్నారు. కానీ నేను తెలంగాణ ప్రజల బాణాన్ని. వీలైనంత తొందరగా సామాజిక తెలంగాణ, బీసీ రిజర్వేషన్లు పూర్తి కావాలని కోరుకుంటున్నా. వచ్చే మూడేళ్లలో చాలా ఛేంజెస్ వస్తాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనతో మహిళలకు మేలు జరుగుతుంది. తెలంగాణలో 69 మంది మహిళ ఎమ్మెల్యేలు అవుతారు. కచ్చితంగా దగాపడ్డ ఉద్యమకారులను అక్కున చేర్చుకుంటాం. పరిహారం అందని అమరవీరుల కుటుంబాలకు పరిహారం ఇప్పించే ప్రయత్నం చేస్తాం. స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు, స్వరాష్ట్రం తెచ్చుకొని 12 ఏళ్లైన పరిస్థితిలో మార్పు లేదు. కనీసం విద్య, వైద్యం కూడా ప్రజలకు అందివ్వలేకపోతున్నామన్నదే నా ఆవేదన' అని కవిత పేర్కొన్నారు.

గతంలో కేసీఆర్ గారి సపోర్ట్ తో సింగరేణిలో కార్మికుల హక్కులను కాపాడుకున్నామని కవిత అన్నారు. ఐతే ఇంకా జరగాల్సింది చాలా ఉందని అభిప్రాయపడ్డారు. 'ఆర్టీసీ లో చాలా దారుణమైన పరిస్థితి. దీనిపై మనం ఆలోచించాలి. అంతా బాగుంది అనుకున్నాం గనుకే 200 ఏళ్లు బ్రిటిష్ వాళ్ల బానిసత్వంలో ఉన్నాం. 60 ఏళ్లు తెలంగాణ కూడా పరాయి పాలనలో ఉంది. ఒక్కసారి ఆలోచన చేయటంతోనే స్వాతంత్రం వచ్చింది. ఇంకా ఎన్నాళ్లు ఇతర దేశాలలో ఉద్యోగాల కోసం వెళ్తాం. అమెరికా, దుబాయ్ వాళ్లు మనల్ని వెళ్లగొడుతున్నారు. మనం ఉన్నచోట ఉద్యోగాలు లేవు. ఇప్పుడు విప్లవాత్మక మార్పు రావాల్సిన అవసరముంది. ఇతర దేశాల్లో జీతం ఇవ్వకపోయినా, కొట్టి చంపినా పట్టించుకునే పరిస్థితి లేదు. సమస్యలు తీరాలంటే పిడికిలి బిగించి ఉద్యమం చేయాలి' అని అన్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్ ది 'ఫెవికాల్ బంధం'

**( మొదటిపేజీ తరువాయి )**

ఆటోలలో తిరిగి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఈ ప్రాంత సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని, ఇప్పుడు వచ్చి పరిష్కరిస్తామని కల్లబొల్లి మాటలు చెప్తే ఇక్కడి జనం నమ్మరని అన్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తూ.. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లెలిని ఇంటి నుంచి పంపిన వ్యక్తి సునీతమ్మను మంచిగా చూసుకుంటారా అని ప్రశ్నించారు. ఇది వాళ్ల చెల్లెలే బయటకు వచ్చి చెబుతుందని అన్నారు.

బీజేపీ నాయకులపై కూడా రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేంద్ర మంత్రిగా ఉండి కూడా కిషన్ రెడ్డి ఈ నియోజకవర్గం నుంచి ఎందుకు నిధులు తీసుకురాలేకపోయారని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ ది 'ఫెవికాల్ బంధం' అని ఆరోపించారు. 2007లో పీజేఆర్ ఆకస్మికంగా చనిపోతే.. ఏకగ్రీవంగా చేయాలనే మాట ఉన్నా అభ్యర్థిని పెట్టి ఎన్నికలు తెచ్చిన దుర్మార్గుడు కేసీఆర్ అని ధ్వజమెత్తారు. పేదలను ఆదుకున్న చరిత్ర పీజేఆర్ ది అని, ఈ ప్రాంత బస్తీల్లో ఎవరి తలుపు తట్టినా పీజేఆర్ సాయం పొందినవారే ఉంటారని గుర్తుచేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. అందరికీ రేషన్ కార్డులు.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్.. ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ సన్నబియ్యం.. ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. ఉచిత బస్సు రద్దు చేయాలని బీఆర్ఎస్‌వాళ్లు మాట్లాడుతున్నారని.. ఇది వాళ్ల "గలీజ్ బుద్ధి" అని విమర్శించారు. మహిళలకు మంత్రి పదవులు ఇవ్వని బీఆర్ఎస్‌కు భిన్నంగా, తమ ప్రభుత్వంలో సీతక్క, కొండా సురేఖలకు మంత్రి పదవులు ఇచ్చామని చెప్పారు. స్థానిక అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని కోరుతూ.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. బోరబండ చౌరస్తాకు పీజేఆర్ పేరు పెడుతామని.. విజయయాత్రకు మళ్లీ వచ్చి ఆ చౌరస్తాకు పీజేఆర్ చౌరస్తాగా పేరు పెట్టుకుందామని ప్రకటించారు. నవీన్‌ను 30 వేల ఓట్ల మెజారిటీతో గెలిపిస్తే.. వందల కోట్లతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత నవీన్ తీసుకుంటాడని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

# ప్రాణాలు హరించిన శ్రీహరి..!





- **శ్రీకాకుళం జిల్లాలో ఘోర విషాదం జరిగింది**
- **కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట**
- **12 మంది భక్తులు అక్కడికక్కడే దుర్మరణం**
- **ఘటనపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు విచారం**
- **పలువురి పరిస్థితి విషమంగా ఉంది**
- **ఉత్తరాంధ్ర చిన్న తిరుపతిలా ఆలయానికి ప్రచారం**
- **ఏకాదశి నేపథ్యంలోఆలయానికి 25వేల మంది భక్తులు**

**( మొదటిపేజీ తరువాయి )**

పలువురి పరిస్థితి విషమంగా ఉంది. అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు.భక్తుల తాకిడికి రెయిలింగ్ ఊడిపోయిందని దీంతో పలువురు కిందపడటంతో తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలియజేశారు. కార్తీక మాసం నేపథ్యంలో కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయానికి భక్తులు ప్రతిరోజు ఎక్కువమొత్తంలో వస్తున్నారు. కార్తీక మాసం అందులోనూ నేడు ఏకాదశి కావడంతో భక్తులు మరింత భారీ సంఖ్యలో తరలివచ్చారు. అయితే భక్తుల రద్దీ కారణంగా ఆలయంలో ఉన్న రెయిలింగ్ ఊడిపోవడంతో భక్తులు కింద పడిపోయారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఉత్తరాంధ్ర చిన్న తిరుపతిలా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. చిన్న తిరుపతిగా పేరు రావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్న సంగతి తెలిసిందేజ. అయితే ఏకాదశి సందర్భంగా ఆలయ అధికారులు, ఆలయ సిబ్బంది.. భక్తులకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని తెలుస్తోంది.భక్తుల సంఖ్య విపరీతంగా పెరగుతున్నప్పటికీ ఆలయ నిర్వాహకులు అందుకు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతోనే తొక్కిసలాట చోటుచేసుకున్నట్లుగా ప్రాథమికంగా తెలుస్తోంది.దీంతో అధికారుల నిర్లక్ష్యంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇంతపెద్ద ప్రమాదం జరిగింది అని భక్తులు మండిపడుతున్నారు.

కాశీబుగ్గ పదనాపురం నాలుగేళ్ల క్రితం ఈ ఆలయ నిర్మాణాన్ని ధర్మకర్త హరిముకుంద్ పండా ప్రారంభించారు. 12 ఎకరాల సొంత భూమిలో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. ఆలయం ఐదు ఎకరాల్లో ఉంది. సుమారు రూ.20 కోట్లతో దీనిని నిర్మించారు. కాగా, తనకు తిరుమల వెళ్లిన సమయంలో దర్శనం కాకపోవడంతోనే ఇక్కడ ఆలయం నిర్మించినట్టు తెలిసింది. ఇక, కొత్తగా నిర్మించిన ఆలయంలో మే నుంచి దర్శనాలు ప్రారంభమయ్యాయి. చిన్న తిరుపతిగా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి క్షేత్రం ప్రసిద్ధిలోకి వచ్చింది. వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం గురించి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కూడా చేశారు. దీంతో, ఆలయానికి ప్రతీ రోజు దాదాపు 1000 మంది వరకు భక్తులు వస్తున్నారు. ప్రతి శనివారం ఈ ఆలయానికి భారీగా భక్తులు తరలివస్తారు. ఆలయ సామర్థ్యం దాదాపు రెండు వేల నుంచి మూడు వేలుగా ఉందని పలువురు చెబుతున్నారు. అయితే, శనివారం ఏకాదశి నేపథ్యంలో ఆలయానికి దాదాపు 25వేల మంది భక్తులు వచ్చినట్టు సమాచారం. కాగా, భక్తుల రద్దీని పోలీస్ ఇంటలిజెన్స్ విభాగం, ఆలయ కమిటీ అంచనా వేయలేదు. ఆలయ కమిటీ సొంతగా భద్రతను సైతం ఏర్పాటు చేయలేదు. వేల సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినప్పటికీ పోలీసు సిబ్బంది రాలేదు. గంట సమయం దాటినా ఘటనా స్థలానికి 108 అంబులెన్స్ చేరుకోలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కాశీబుగ్గ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనపై ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో భక్తులు మృతి చెందడం చాలా విషాదకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం చంద్రబాబు నాయుడు స్థానిక అధికారులకు ఆదేశించారు. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని... క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా పర్యవేక్షించాలని ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగానికి సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఈప్రమాదంపై దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్, జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను సంప్రదించి, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలనే సూచించారు.

# హోం మినిస్టర్‌గా అజారుద్దీన్..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో అధికార కాంగ్రెస్ వ్యూహాలు అంతుచిక్కడం లేదు. ఎట్టి పరిస్థితుల్లో గెలుపు అజెండాతో బరిలో దిగిన హస్తం నేతలు ఊహకందని ఎత్తులు వేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో భారీగా ఉన్న మైనార్టీ ఓటర్లను బుట్టలో వేసుకునేలా పావులు కదుపుతుండటం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. ఈ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు తీసిపోని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని అంటున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 67 మంది ఎమ్మెల్యేలు ఉండగా, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేనితోపాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన మరో 12 మందితో కలిపి అధికార పార్టీ బలం 80కి చేరింది. అయితే వీరిలో ఏ ఒక్కరూ మైనార్టీ వర్గానికి చెందిన వారు లేకపోవడంతో ఆ వర్గానికి మంత్రి పదవి దక్కలేదు. నిజానికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్ననాడే మైనార్టీల నుంచి ఎవరో ఒకరిని మంత్రిగా నియమిస్తారని భావించారు. కానీ, అప్పట్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీ నేతలకు ప్రాతినిధ్యం లేకపోవడంతో సాధ్యపడలేదు. ఆ తర్వాత ఎమ్మెల్సీగా మైనార్టీ నేత మస్కతీని తీసుకోవాలని నిర్ణయించడంతో మంత్రిగా ఆయన పేరు తెరపైకి వచ్చింది. అదే సమయంలో సీనియర్ నేత షబ్బీర్ అలీ సైతం రేసులోకి రావడంతో మైనార్టీ మంత్రి కోటా భర్తీ పెండింగులో పడిపోయింది.

కాంగ్రెస్ నుంచి మైనార్టీ కోటాలో షబ్బీర్ అలీతోపాటు టీం ఇండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్, నాంపల్లి నుంచి పోటీచేసిన మొహమ్మద్ ఫిరోజ్ ఖాన్ మధ్య పదవుల కోసం తీవ్ర పోటీ ఉంది. అయితే ఈ ముగ్గురిలో ఎవరికి మంత్రి పదవి ఇవ్వాలనే తర్జనభర్జన మధ్యే రెండేళ్ల కాలం గడిచిపోయింది. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రావడంతో ముగ్గురిలో అజారుద్దీన్ కు లైన్ క్లియర్ అయింది. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచే పోటీ చేసిన అజారుద్దీన్ దాదాపు 20 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయితే నియోజకవర్గానికి కొత్త కావడం, అప్పటికే టికెట్ ఆశించిన విష్ణువర్ధన్ రెడ్డి పార్టీ మారడంతో అజారుద్దీన్ ఓటమి చెందినట్లు విశ్లేషణలు ఉన్నాయి.

ఈ పరిస్థితుల్లో ఉప ఎన్నికల్లో పోటీకి రెడీ అయిన అజారుద్దీన్ ను కాంగ్రెస్ అధిష్టానం తప్పించింది. ప్రతిగా మంత్రి పదవి ఇవ్వడంతోపాటు ఎమ్మెల్సీగా చేస్తామని హామీ ఇచ్చింది. మాట ఇచ్చినట్లే గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదన



ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగులో ఉండగా, శుక్రవారం ఆయనతో మంత్రి పదవికి ప్రమాణ స్వీకారం చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అయితే మంత్రివర్గ విస్తరణపై బీజేపీ ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేసినా, ఆగే పరిస్థితి లేదంటున్నారు. దీంతో శుక్రవారం అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన వెంటనే ఆయనకు శాఖలు కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో మైనార్టీలకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా అజారుద్దీన్ కు మైనార్టీ సంక్షేమంతోపాటు కొన్ని ఇతర కీలక శాఖలు అప్పగించే చాన్స్ ఉందని అంటున్నారు. ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్న హోంశాఖను అజారుద్దీన్ కు కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వంలో మైనార్టీ నేత మహమ్మద్ అలీ ఉప ముఖ్యమంత్రి హోదాలో హోంశాఖ బాధ్యతలు చూశారు. ఆయన కూడా పెద్దల సభ సభ్యుడుగానే ఎన్నికయ్యారు. దీంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహాన్నే అమలు చేసేలా కాంగ్రెస్ సర్కారు పావులు కదిపే అవకాశం ఉందని అంటున్నారు.

క్రికెట్ లో టీం ఇండియా కెప్టెన్ గా పనిచేసిన అజారుద్దీన్ కు ఇంగ్లీషు, హిందీలపై మంచి పట్టు ఉంది. దీంతో అఖిల భారత సర్వీసు అధికారులను ఆయన బాగా డీల్ చేసే సామర్థ్యం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ కారణంగానే హోంశాఖ అప్పగిస్తే ఎలా ఉంటుందన్న విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుల సలహాలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. అదే సమయంలో విద్యాశాఖను కూడా అప్పగించాలనే ప్రతిపాదన పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఏదిఏమైనా మంత్రివర్గంలో చేరనున్న అజ్జూ భాయ్ కి కీలక బాధ్యతలు ఇవ్వడం ఖాయమనే అంటున్నారు.

## వరద నివారణకు శాశ్వత చర్యలు

**మేయర్ గుండు సుధారాణి**

**విశాలభారతి, వరంగల్:** నగరంలో వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంజనీరింగ్, ఇరిగేషన్ టౌన్ ప్లానింగ్ విభాగాలతో శనివారం ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మేయర్ తగు సూచనలు చేశారు. ఖిలా వరంగల్ నుంచి రామన్నపేట, పోతన నగర్, అలంకార్ మీదుగా ముచ్చర్ల నాగారం చెరువు వరకు సమాంతరంగా ఉన్న డ్రైన్ పరిస్థితిపై ఆరా తీశారు. భవిష్యత్తులో క్లౌడ్ బరస్ట్ (మేఘాల విస్ఫోటనం) జరిగితే, ఒకవేళ 40 సెంటీమీటర్‌లు దాటి వర్షపాతం నమోదైతే అందుకు సన్నద్ధంగా డిజైన్‌లను రూపొందించాలని అధికారులకు సూచించారు. ఇటీవల నగర పర్యటనలో సీఎం సూచించిన విధంగా ఎంతటి వర్షపాతాన్నయినా తట్టుకొని నిలిచేలా డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు.

# 'సారీ' మరోసారి..!



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కు కేబినెట్‌లోకి బెర్తు కల్పించింది. అయితే, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు కాంగ్రెస్ మూడోసారి రిక్త 'హస్తమే' చూపింది. తాజాగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారంతో కలిపి కలిపి ఇప్పటివరకూ మూడు సార్లు కేబినెట్ విస్తరణ జరిగినా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ప్రాతినిధ్యమే లేకుండా పోయింది.

కచ్చితంగా మంత్రి పదవి వస్తుందని భావించిన బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డికి మరోసారి నిరాశే మిగిలింది. అలాగే, ఉమ్మడి జిల్లాకు చెందిన మరో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీకి కూడా భంగపాటే ఎదురైంది. ఆయనకు కూడా ఈసారి అవకాశం దక్కకుండా పోయింది. మంత్రి పదవి రాలేదన్న తీవ్ర అసంతృప్తిలో ఉన్న బోధన్ ఎమ్మెల్యేను సంతృప్తి పరిచేందుకు కాంగ్రెస్ నాయకత్వం.. షబ్బీర్‌అలీ తరహాలోనే ఆయనను కూడా ప్రభుత్వ సలహాదారుగా నియమించింది.

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కూడా మంత్రి పదవి కోసం ఎదురు చూస్తున్నారు. పార్టీ హైకమాండ్ తనను మోసం చేయదని.. ఆయన అనుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో అందరూ పార్టీ మారిపోయినా తాను మాత్రం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని కాపాడుకున్నానని చెబుతూ వస్తున్నారు. అయితే సామాజిక సమీకరణాలతో ఆయనకు పదవులు ఇవ్వలేకపోయారు. ఈ కారణంగా ఆయనకు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. మరో నేత రాజగోపాల్ రెడ్డి కూడా మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారు. అయితే ఆయన కు మాత్రం ఎలాంటి నామినేటెడ్ పోస్టు ప్రకటించలేదు. మంత్రి పదవి ఇవ్వకపోవడంతో .. ఆయన ఇటీవలి కాలంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. పార్టీ మారుతారన్న ప్రచారమూ జరుగుతోంది. ఆయన క్రమశిక్షణ ఉల్లంఘిస్తూండటంతో నామినేటెడ్ పోస్టులు కూడా ఇవ్వడం లేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్ర కేబినెట్లో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరో ఒకరు ప్రాతినిధ్యం వహిస్తుండడం కొన్ని దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కూడా ఆ సంప్రదాయం కొనసాగింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాకు చెందిన నేతలెందరో మంత్రులుగా పని చేశారు. అర్గుల్ రాజారాం, మహిపాల్ రెడ్డి నుంచి మొదలుకుని సంతోష్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, డి.శ్రీనివాస్, వేముల ప్రశాంత్ రెడ్డి వరకూ వివిధ ప్రభుత్వాల్లో జిల్లా నుంచి అమాత్యులుగా ప్రాతినిధ్యం వహించారు. అయితే, దాదాపు పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాకు కేబినెట్ లో చోటు లేకుండా పోయింది. తొలిసారి మంత్రివర్గ విస్తరణ జరిగిన సమయంలో రేవంత్ రెడ్డి సహా 12 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయగా, వారిలో జిల్లా నుంచి ఒక్కరికీ అవకాశం దక్కలేదు. ఇటీవల రెండో సారి విస్తరణ జరిగినప్పటికీ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు చాన్స్ రాలేదు. మూడోసారైనా అవకాశం లభిస్తుందనుకుంటే నిరాశే మిగిలింది.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాపై కాంగ్రెస్ నాయకత్వం వివక్ష చూపుతున్నట్లే కనిపిస్తోంది. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో కలిపి కాంగ్రెస్ పార్టీకి నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన పోచారం శ్రీనివాస రెడ్డి తదనంతర పరిణామాల్లో హస్తం పార్టీ పంచన చేరారు. రాజీకయంగా ఎంతో కీలకమైన ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం.. సలహాదారులతో సరిపెడుతోంది. సీనియర్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరిన పోచారం శ్రీనివాసరెడ్డికి సైతం ప్రభుత్వ సలహాదారుగా అవకాశం కల్పించింది. ఇక తాజాగా, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డిని కూడా సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ సలహాదారుల సంఖ్య మూడుకు చేరింది.

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి వస్తుందని అంతా భావించారు. ఆయన కూడా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ తొలి, మలి విడుత విస్తరణలో భంగపాటు తప్పలేదు. తాజాగా జరిగిన విస్తరణలో అయినా చాన్స్ వస్తుందని భావించగా, మరోసారి నిరాశే ఎదురైంది. 70 ఏండ్ల వయస్సు పైబడిన సుదర్శన్ రెడ్డి ఆది నుంచి కాంగ్రెస్ వాదిగా ఉన్నారు. గత పదేళ్లలో పార్టీ అనేక కష్టాల్లో ఉన్నప్పటికీ ఆయన మాత్రం పక్కచూపులు లేదు. వయస్సు, సీనియారిటీ, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకున్నా పీఎస్సార్ కు అమాత్యుడిగా అవకాశం దక్కాల్సి ఉంది. కానీ రేవంత్ ప్రభుత్వం మూడుసార్లు మొండి చేయి చూపింది. ఆయనను ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వేడుకలో
# పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం



**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

హయత్ నగర్ డివిజన్ రాఘవేంద్ర కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాపోలు నరసయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లు సమాజానికి మార్గదర్శకులు. వారి అనుభవం, సలహాలు సమాజ అభివృద్ధికి అత్యంత అవసరం. కాలనీ అభివృద్ధి, సదుపాయాల పరిరక్షణలో అసోసియేషన్ చేసిన సేవలు ప్రశంసనీయం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 90 సంవత్సరాలు పైబడిన వి. నరసింహారెడ్డి , 70 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ఎల్లారెడ్డి, సుబ్రహ్మణ్యం, వసుపరి రాములు, జనార్ధన్ ను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఈ నెలలో జన్మదినం జరుపుకుంటున్న కే. శేఖర్ రెడ్డి, బాణాల ముత్యం రెడ్డి ను సత్కరించారు.ఈ వేడుకల లో భాగంగా నిర్వహించిన క్యారమ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. క్యారమ్ డబుల్స్ విభాగంలో హరినాథ్ బాబు - మల్లారెడ్డి జంట విజేతలుగా నిలిచారు. రన్నర్స్‌గా రాధాకిషన్ రావు - సుబ్రహ్మణ్యం గెలిచారు. సింగిల్స్ విభాగంలో వెంకటేశ్వర రావు విన్నర్‌గా, హరినాథ్ బాబు రన్నర్‌గా నిలిచారు. విజేతలకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి బుచ్చిరెడ్డి , కోశాధికారి హరినాథ్ బాబు, కాలనీ సంఘ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కార్యదర్శి కైలాసనాథ్, కమిటీ సభ్యులు మేఘనాదం, జనార్ధన్ రెడ్డి, అచ్చయ్య నాయుడు, సూర్యనారాయణ, లింగారెడ్డి పాల్గొన్నారు.

## భవిష్యత్ నాయకులుగా సత్తా చాటే నారాయణ విద్యార్థులు

- **నారాయణ స్కూల్ సత్తుపల్లిలో విద్యార్థి క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్ ఘనంగా నిర్వహణ**
- **విద్యార్థుల్లో నాయకత్వం, బాధ్యతా స్పృహ పెంపుదలకు ప్రత్యేక కార్యక్రమం**
- **కొత్త విద్యార్థి నాయకులకు బ్యాడ్జ్‌లు అందజేత, నిజాయితీతో సేవ చేసే ప్రతిజ్ఞ**



**సత్తుపల్లి, విశాలభారతి:**

నారాయణ స్కూల్ సత్తుపల్లి శాఖలో 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థి క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో అట్టహాసంగా జరిగింది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతా స్పృహ పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన అతిథిగా హాజరైన ఏజీఎం రాంకీ, నాయకత్వం అంటే కేవలం పదవి కాదు — కర్తవ్యబద్ధత, క్రమశిక్షణ, సేవాభావం కలగలిపిన లక్షణమని చెప్పారు. ప్రత్యేక అతిథి ఆర్ఎస్‌టీ లక్ష్మపతి, ధైర్యంగా ముందుకు సాగి బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్ తో పాటు డెప్యూటీ హెడ్‌లు, జూనియర్ హెడ్‌లు, క్లబ్ కెప్టెన్లు, హౌస్ ఇన్‌చార్జీలకు బ్యాడ్జ్‌లు అలంకరించి బాధ్యతలు అప్పగించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన విద్యార్థి నాయకులు నిజాయితీ, అంకిత భావంతో విధులు నిర్వహించేందుకు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ క్రాంతికుమార్, కోఆర్డినేటర్ ప్రవీణ్, వినోదలక్ష్మి, నీలిమ, అకాడమిక్ డీన్ రవీంద్ర, వైస్ ప్రిన్సిపల్స్ రమ్య, అనూష, సాఫ్ట్‌స్కిల్ ట్రైనర్ యశ్వంత్, ఏఓ జగదీష్, పీఈటీ గోపిరాజు, బోధనా సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా యువజన నాయకుని జన్మదిన వేడుకలు



**దేవరుప్పుల, విశాలభారతి:** పాలకుర్తి నియోజకవర్గ యువజన యువజన నాయకులు ఎర్రబెల్లి దయాకర్ రావు గారి ప్రియ శిష్యులు గద్దం రాజు పుట్టినరోజు సందర్భంగా సింగరాజు పల్లి కేంద్రంలో ఈరోజు జిల్లా నాయకులు పల్లాసుందర్రాంరెడ్డి మరియు వారి మిత్రులు అందరూ కలిసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు

## నకిలీ బంగారం తాకట్టు పెట్టి డబ్బులతో పరారైన మహిళ



**రాజేంద్రనగర్, విశాలభారతి:** నకిలీ బంగారం కాకట్టుపెట్టి బంగారు షాపు యజమానిని ముగ్గురు మహిళలు బురిడీ కొట్టించారు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీస్ స్టేషన్ పరిధిలో బుద్వేల్ లో ఉన్న శ్రీ గణేష్ పాన్ బ్రోకర్ బంగారం షాప్ లోకి వచ్చిన ముగ్గురు మహిళలు తమ వద్ద ఉన్న వన్ గ్రామ్ బంగారాన్ని బంగారం షాప్ లో తాకట్టు పెట్టారు. మొత్తం రూపాయలు 1,70,000 కావాలని షాప్ యజమానిని కోరగా షాప్ యజమాని 1,40,000 రూపాయల నగదు, 30000 రూపాయలు ఆన్లైన్ పేమెంట్ చేశారు. వాళ్లు వెళ్లాక తాకట్టు పెట్టిన బంగారాన్ని పరిశీలించగా... అది వన్ గ్రామ్ గోల్డ్ అని తెలిసింది. సీసీ కెమెరాల ఆధారంగా ఈ విషయాన్ని గుర్తించాడు. షాపు యజమాని తను మోసపోయానని గమనించి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. షాప్ లోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఫిర్యాదు దారునీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివితేనే భవిష్యత్తు



**తొర్రూరు, విశాలభారతి:** విద్యార్థులు కష్టపడి చదివి గుర్తింపు తెచ్చుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామ నరసయ్య అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రోఫ్ పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ వంగాల గోపాల్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తొర్రూరు బస్టాండ్ లో షుగర్, బిపి పరీక్షలు నిర్వహించి బస్టాండ్ ఆవరణలో పేద వృద్ధురాలికి చీరను పంపిణీ, గుర్తురు జడ్పి హెచ్ఎస్ పాఠశాలలో 6,10 తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్స్, ఎగ్జామ్ ప్యాడ్లు, స్కూల్ బ్యాగులు, హన్మకొండలోని సహృదయ హోల్డేజ్ హోమ్ కు బియ్యం నిత్యవసర సరుకులు, రఘు లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుపేదల అభివృద్ధి కోసం లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ దామెర సరేష్, పిఆర్సి తమ్మెర విశ్వేశ్వరరావు , పిజెడ్సి సతీశ్ రెడ్డి, క్లబ్ సెక్రటరీ ముడుపు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో వాసవి కళాశాల విద్యార్థుల ప్రతిభ

- **బాలికల అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్ 48 కేజీల విభాగంలో సిల్వర్ పతకం**
- **హర్షం వ్యక్తం చేసిన వాసవి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ మాదారం రమేష్**

**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:** ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం 69వ రంగారెడ్డి జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ అండర్ 17 విభాగంలో జరిగిన పోటీల్లో ఇబ్రహీంపట్నంలోని వాసవి గ్రూప్ ఆఫ్ ఇన్స్టి ట్యూషన్ ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి జే.రితిక అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్ 48 కేజీల కేటగిరీలో బాలికల విభాగంలో వెండి పతకం సాధించింది. ఈ సందర్భంగా వాసవి విద్యాసంస్థల చైర్మన్ మాదారం రమేష్ మాట్లాడుతూ... తమ కళాశాల విద్యార్థులు క్రీడారంగంలో చదువులో పాటుగా , క్రీడల్లో రాణించడం గర్వంగా ఉందని అన్నారు. భవిష్యత్ లో ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆకాక్షించారు. కళాశాలకు ,తల్లితండ్రులకు మంచి గుర్తుంపు తీసుకురావాలని అన్నారు. అనంతరం వాసవి విద్య సంస్థల చెర్మన్ మదారం రమేష్, శేఖర్ గౌడ్ లు క్రీడాకారులను, పీఈటి రహమత్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం సుధాకర్, సురేష్ ప్రశాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.



## రైతుల మేలు కోసమే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



- **రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు**
- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

రైతులు దళారీల బారినపడి నష్టపోవద్దనే ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కోహెడ , డిసిఎంఎస్ ఆధ్వర్యంలో పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ పరిధిలోని బాచారం, గౌరెల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకవచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ ఏడాది ధాన్యం మద్దతు ధరను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు . ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ. 2,389, సాధారణ రకానికి రూ2.369 మద్దతు ధర ఇస్తుందన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా వరిధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కొత్త కురుమ సత్తయ్య, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ లు ,అధికారులు ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గవాయ్ అవమానంపై బహిష్కరణ వేటు



- **టిఎం హెచ్పి పోరాట ఫలితం**
- **తెలంగాణ మాదిగ హక్కుల దండోరా**

**అశ్వరావుపేట, విశాలభారతి:**

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై షూను విసిరేందుకు ప్రయత్నించిన, అడ్వకేట్ రాకేష్ కిషోర్ పై, బహిష్కరణ వేటు పడిన విషయం దళిత వర్గాల్లో సంతోషాన్ని నింపింది, ఈ చర్య వెనుక తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్డీ) రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి నాయకుల నిరంతర పోరాటమే ప్రధాన కారణమని (టీఎంహెచ్డీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ తెలిపారు. దళితుల గౌరవాన్ని కాపాడడంలో మా సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని, గవాయ్ వంటి ప్రతిష్ఠాత్మక న్యాయమూర్తి పై జరిగిన అవమానాన్ని మేము ఎట్టి పరిస్థితుల్లోనూ సహించము అని. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్న మా డిమాండ్ కి ఇది ఫలితంగా నిలిచింది అని ఆయన పేర్కొన్నారు. (టీఎంహెచ్డీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాలు, మాదిగ హక్కుల దండోరా నేతల సమిష్టి కృషి వల్లే ఈ నిర్ణయం సాధ్యమైందని ఆయన వివరించారు. ఇది దళిత గౌరవానికి గెలుపు, న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసానికి బలమైన సంకేతం"అని కొరిపల్లి అన్నారు. కార్యక్రమంలో (టిఎం హెచ్డి)జిల్లా ఉపాధ్యక్షులు కనకపూడి వీర స్వామి మాదిగ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మునగలేటి వీరస్వామి మాదిగ, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదూరి బాలకృష్ణ మాదిగ, ఖమ్మం నియోజకవర్గ ఇన్చార్జి పిల్లిగుండ్ల ముత్తయ్య మాదిగ, ఇల్లందు నియోజకవర్గ ఇన్చార్జ్ మంద కుమార్ మాదిగ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ వీరేంద్ర చౌదరి జన్మదిన వేడుకలు



**రైతుల సహాయార్థం రూ.లక్ష 16 అందజేత**

**శేరిలింగంపల్లి: విశాలభారతి:** మియాపూర్ మదినగూడ లోని త్రివేణి స్కూల్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి జన్మ వేడుకలు శనివారం స్కూల్ ప్రాంగణంలో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థుల కోలహాల మధ్య పండుగ వాతావరణం తలపించేలా స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులతో పాటు కలిసి గొల్లపూడి వీరేంద్ర చౌదరి అత్యంత ఉల్లాసంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు తోటి ఉపాధ్యాయులకు పంచిపెట్టారు.ఈ సందర్భంగా ఇటీవల కురిచిన అకాల వర్షాలకు తీవ్రమైన పంట నష్టం జరగడంతో రైతులకు భరోసా కల్పించేందుకు విద్యాసంస్థల డైరెక్టర్ల మండలి ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు కలిసి సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా రైతుల సహాయార్థం నిధుల సేకరణ చేపట్టి లక్ష 16 వేల రూపాయలు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు అందజేశారు. ఈ మేరకు నిధులను స్వీకరించిన గవర్నర్ హర్షం వ్యక్తం చేసినట్లు వీరేంద్ర చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ... రైతులకు సహాయం చేయడం అనేది తమ యొక్క విద్యాసంస్థల సామాజిక బాధ్యతగా భావిస్తున్నాను గొప్ప సేవ యజ్ఞంలో విద్యార్థులు ఉపాధ్యాయులు భాగస్వామి ఎంతో గర్వకారణం అని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో త్రివేణి స్కూల్ సెంట్రల్ టీం, జోనల్ టీం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ,పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## లేడి దొంగల ముఠా హల్ చల్

- **ఆటోలో వచ్చి దర్జాగా చోరీకి యత్నం**
- **నిర్మాణంలో ఉన్న ఇంట్లో ఘటన**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** ఓ లేడీ దొంగల ముఠా హల్చల్ చేసింది. దర్జాగా ఆటోలో వచ్చి నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి తాళం విరగొట్టి లోపలికి ప్రవేశించింది. లోపల ఏమి లభించకపోవడంతో దొంగల ముఠా తిరిగి వెళ్లిపోయిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ న్యూ ఫ్రెండ్స్ కాలనీలో జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున ఏడు మంది మహిళలు ఓ ఆటోలో న్యూ ఫ్రెండ్స్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్దకు వచ్చారు. తాళం విరగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో ఏమీ దొరకకపోవడంతో తిరిగి ఉసురుమంటూ వెళ్లిపోయారు. లేడీ దొంగల ముఠాకు సంబంధించిన ప్రతి కదలిక సీసీ కెమెరాల్లో నమోదయింది. ఈ వీడియో శనివారం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పోలీసుల మెగా కరువైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పాల్వంచ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో రక్తదానం



**రక్తదానం చేసి మహిళ ప్రాణం కాపాడిన పార్థసారథి, శిద్ధార్**

**పాల్వంచ, విశాలభారతి:** ములకలపల్లి మండలం ఎన్ జగన్నాధపురం గ్రామానికి చెందిన పిట్టల లక్ష్మి అనారోగ్యంతో పాల్వంచ ప్రభుత్వ హాస్పిటల్ నందు అడ్మిట్ కాగా వైద్యులు పరీక్షలు చేసి 3పర్సెంట్ రక్తం ఉంది అర్జెంటుగా రక్తం ఎక్కించాలని తెలిపారు. పాల్వంచ ప్రభుత్వ హాస్పిటల్ నందు B+ పాజిటివ్ రక్తం అందుబాటులో లేకపోవడంతో వారు దాతల కోసం ప్రయత్నం చేస్తున్న సమయంలో పాల్వంచ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు గుంట్రు వేణును ఆశ్రయించగా వెంటనే స్పందించిన ఆయన ముందుకు వచ్చి గొర్రె ముచ్చు పార్థసారథి మరియు టి సిద్ధార్థ్ అను ఇద్దరు యువకులతో ఆమెకు బి+ పాజిటివ్ రక్తాన్ని దానం చేసి సరైన సమయంలో ఆమె ప్రాణాలను కాపాడడం జరిగింది.ఈ సందర్భంగా పిట్టల లక్ష్మి వారి బంధువులు పాల్వంచ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## భారీ కొండచిలువ కలకలం

**యాచారం మండలం కుర్మిద్ద గ్రామంలోని ఓ వెంచర్ లో ఘటన**

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కుర్మిద్ద గ్రామంలో పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న వెంచర్‌లో కొండ చిలువ కలకలం రేపింది. భారీ కొండచిలువ ప్రత్యక్షమవడంతో దాన్ని చూసినవారు భయంతో వణికిపోయారు. యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద, గ్రామంలోని పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న వెంచర్‌లో గత కొంతకాలంగా సముద్రాల అంజయ్య, గౌరెలను కాస్తు జీవనం సాగిస్తున్నాడు. రోజు మాధురి గానే శనివారం యధావిధిగా వెంచర్‌లోకి వెళ్లాడు ఒక గదిలో శబ్దం రావడంతో ఉడుము ఉందని ఆ గదిలోకి వెళ్లి చూడగా 8 అడుగుల భారీ కొండచిలువ కనిపించడంతో భయంతో పరుగులు తీశాడు. గ్రామస్తులకు సమాచారం అందించడంతో దాన్ని పట్టుకోవడానికి ఫారెస్ట్ అధికారులకు సమాచారం చేరవేయగా అక్కడికి చేరుకున్న అధికారులు రెండు గంటలపాటు శ్రమించి ఒక సంచిలో బంధించి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి వదిలిపెట్టడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## నవీన్ యాదవ్‌కి మద్దతుగా ఝాన్సీ రెడ్డి ప్రచారం



**తొర్రూరు, విశాలభారతి:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ గెలుపు కోసం టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి రెడ్డి ఇంటింటా ప్రచారం చేపట్టారు.కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ పరిధిలోని యూసుఫ్ గూడ డివిజన్ లో నవీన్ యాదవ్ తో స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే శంకర్ తో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని ఒక మినీ ఇండియాగా తీర్చిదిద్దేందుకు రేవంత్ రెడ్డి అద్భుతమైన దార్శనికతతో పనిచేస్తున్నారని కొనియాడారు. జూబ్లీహిల్స్ ఓటర్లు సీఎం రేవంత్ నాయకత్వానికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.నవీన్ యాదవ్ స్థానికుడు కావడంతో ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని చెప్పారు.నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలో రోడ్లు,విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తారన్నారు. ఆయన గెలుపుతో జూబ్లీహిల్స్ అభివృద్ధి వేగవంతం అవుతుందని చెప్పారు. హైదరాబాదు విశ్వ నగరంగా మారాలంటే నవీన్ యాదవ్ ను గెలిపించి ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు .ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు,జూబ్లీహిల్స్ వాసులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కారమే ప్రధాన లక్ష్యం

**జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**



**ఎల్బీనగర్, విశాలభారతి:** మన్సూరాబాద్ డివిజన్, చిత్రసీమ కాలనీలో ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి స్థానికులతో, టీజీస్పడీసీల్ అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి, కాలనీ వాసుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో విద్యుత్ సంబంధిత ప్రమాదాలను నివారించేందుకు అత్యవసర చర్యలు తీసుకొని డ్యామేజ్ అయిన ఎలక్ట్రిక్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడం, లూజ్‌గా ఉన్న వైర్లు బిగించడం, ప్రమాదకర ప్రాంతాల్లో ట్రాన్స్ఫార్మర్ల వద్ద భద్రతా చర్యలు తీసుకోవడం కోసం అధికారులు వెంటనే పని ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో టీజీస్పడీసీల్ ఏఈ శంకర్, రాజయ్య చారి, ప్రభాకర్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి. మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జి. హర్షవర్ధన్ రెడ్డి, మాధవ రెడ్డి, చల్మా రెడ్డి,రవీందర్ రెడ్డి,. సురేందర్ రెడ్డి,అమృత రెడ్డి, వెంకట్ రెడ్డి,. వెంకట్ రెడ్డి,విజేందర్ రెడ్డి, పూర్ణచందర్ రావు,రమేష్ రెడ్డి,పి. యాదగిరి రెడ్డి, శ్రవణ్ రెడ్డి, దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లడ్డూ ఆశచూపి నాలుగేళ్ల చిన్నారిపై అఘాయిత్యం

- యాదాద్రి భువనగిరి జిల్లాలో దారుణం జరిగింది
- మద్యం సేవించిన ఇద్దరు వ్యక్తుల అరాచకం
- చౌటుప్పల్ పురపాలిక పరిధిలో ఘటన
- ఈ సంఘటన ఆసల్యంగా వెలుగులోకి వచ్చింది
- లడ్డూ ఇప్పిస్తానని చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లారు
- చిన్నారి తల్లి చౌటుప్పల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మద్యం సేవించిన మత్తులో ఇద్దరు వ్యక్తుల అరాచకానికి అభంశుభం తెలియని నాలుగేళ్ల చిన్నారి నరకం చూసింది. ఈ దారుణ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ పురపాలిక పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం అలహాబాద్‌కు చెందిన దంపతులు 3 నెలల క్రితం ఇక్కడకు వలస వచ్చారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్ద పెయింటింగ్ కాంట్రాక్టర్ వద్ద కూలీగా పని చేస్తున్నారు.

వారి నివాసానికి ఎదురుగానే మధ్యప్రదేశ్‌కు చెందిన దినేశ్ కోల్(46), శివరాజ్ కోల్(45) అనే వారు ఉంటారు. వారు ఓ కెమికల్ పరిశ్రమలో దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. శుక్రవారం ఉదయం వారి ఇంటి ఎదురుగా ఉండే నాలుగేళ్ల చిన్నారి తోబుట్టువులతో కలిసి ఆడుకుంటోంది. ఆ సమయంలో లడ్డూ ఇప్పిస్తానని చెప్పి దినేశ్ కోల్, శివరాజ్ కోల్ తమ ఇంట్లోకి ఎత్తుకెళ్తుండగా ఓ బాలిక చూసింది. కొద్దిసేపటికి చిన్నారి కేకలు వేయడంతో ఆమె తల్లి విని ఇంట్లో నుంచి బయటికి వచ్చింది. చూసిన బాలిక దినేశ్, శివరాజ్ తీసుకెళ్లారని ఆమెకు చెప్పింది. స్థానికులు తలుపులు పగులగొట్టి చూడగా చిన్నారిపై వారు అఘాయిత్యానికి పాల్పడినట్లుగా గమనించి వెంటనే డయల్ 100 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించారు. చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని నిలోఫర్ హాస్పిటల్‌కు పంపించారు. నిందితులిద్దరూ బాగా మద్యం సేవించినట్లుగా తెలిసింది. తన కుమార్తెపై దినేశ్, శివరాజ్ అత్యాచార యత్నానికి పాల్పడ్డారని చిన్నారి తల్లి చౌటుప్పల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మెడికల్ రిపోర్టు ఆధారంగా తమ దర్యాప్తు కొనసాగుతుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. స్వేచ్ఛగా ఎదగాల్సిన బాల్యాన్ని కొంతమంది తమ చేష్టలతో అభద్రతా భావంలోకి నెట్టేస్తున్నారు. అభంశుభం తెలియని చిన్న పిల్లలకు మాయమాటలు చెప్పి అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు ఏదో చోట జరుగుతూనే ఉన్నాయి. బాలలపై దారుణాలకు ఒడిగడుతున్న ప్రబుద్ధుల్లో పొరుగు వారు, బంధువులే కాకుండా కుటుంబీకులు, విద్యాబుద్ధులు నేర్పించాల్సిన వారు సైతం ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలే పలు పోక్సో కేసుల్లో నిందితులను కోర్టులు కఠిన శిక్షలు విధించాయి. అయినా రాష్ట్రంలో ఏదో చోట ఇలాంటి ఘటనలు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఇంటా, బయటా, చదివే చోట జాగ్రత్తగా ఎలా మసలుకోవాలో తల్లిదండ్రులు పిల్లలకు తెలియజేయాలని పోలీసు అధికారులు తరచూ చెబుతూనే ఉన్నారు. మరోవైపు పలుచోట్ల గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఎవరికి సమస్య ఉన్నా నేరుగా షీ టీమ్, డయల్ 100ను గానీ, పోలీస్ స్టేషన్‌లో గానీ సంప్రదించాలని అవగాహన కల్పిస్తున్నారు. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు పిల్లలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై తప్పనిసరిగా అవగాహన కల్పించాలి. ఎవరైనా ఇబ్బందికరంగా ప్రవర్తించినట్లుగా గుర్తిస్తే తమతో పంచుకోవాలని తల్లిదండ్రులు ధైర్యాన్నివ్వాల్సిన అవసరం ఉంది.

## వేంసూరులో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రైతుల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం
- వేంసూరులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**సత్తుపల్లి, విశాలభారతి:** వేంసూరు మేజర్ పంచాయతీ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ— రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సన్న రకానికి క్వింటాకు ₹2,389, దొడ్డు రకానికి ₹2,369 మద్దతు ధరతో పాటు సన్న రకం వరిపై ₹500 బోనస్ ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఆర్ఓ, ఎంపిడిఓ, వ్యవసాయ శాఖ అధికారులు, ఎస్ఐ, ఏపీఎం, ఏఈవో, వేంసూరు మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల పనులను ప్రారంభించిన కార్పొరేటర్

**కళ్లెం నవజీవన్ రెడ్డి**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శనివారం డివిజన్‌లోని ముదిరాజ్ కాలనీలో కాలనీవాసులతో కలసి నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీలో రహదారుల దుర్దశను పరిగణనలోకి తీసుకొని, ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ప్రజల అభ్యర్థన మేరకు డివిజన్లోని ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతాయని, రానున్న రోజులో కూడా హయత్‌నగర్ డివిజన్ ఆధునిక వసతులతో అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, ముదిరాజ్ కాలనీ అధ్యక్షులు లింగం శ్రీనివాస్, కాలనీ యువజన సంగం అధ్యక్షులు మధు ముదిరాజ్, దాసరి మోని శ్రీనివాస్, సాయి, ప్రకాష్, రాము, బీజేపీ నాయకులు సురేష్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.





## భూగర్భ డ్రైనేజి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**నాచారం, విశాలభారతి:**

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మర్రిగూడా కాలనీలో 14 లక్షల రూపాయలతో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మ రెడ్డి కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి . ఈ సందర్భంగా రైల్వే ట్రాక్ పక్కన ఉన్నటువంటి డ్రైనేజి పైపు లైన్ సమస్య పరిష్కారం కొరకు మరియు ఎన్ ఎఫ్ సి నుండి వస్తున్న కలుషిత వ్యర్థ జలాలు పరిష్కారం కొరకు తగిన చొరవ చూపాలని ఎమ్మెల్యే ని కాలనీ వాసులు కోరారు,

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధించిన రైల్వే మరియు ఎన్ ఎఫ్ సి అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వేణుగోపాల్, కాలనీ వాసులు వంగేటి సంజీవ రెడ్డి, పెద్ది సంజీవ రెడ్డి, బాల్ రెడ్డి, నరేష్, అంజిరెడ్డి, స్థానిక నాయకులు బోదసు లక్ష్మీనారాయణ, తండా వాసుగౌడ్, తిగుళ్ల శ్రీనివాస్, నాగరం బాబు, అల్లాడి కృష్ణ యాదవ్, చిన్న దుర్గయ్య, నాగేందర్, దీపక్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## మూడు ఫీట్లుంటవ్ నువ్వెంత

( మొదటిపేజీ తరువాయి )

పార్టీలు తమదైన స్టైల్ లో ముందుకు వెళ్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి సీఎం రేవంత్ రెడ్డిపై పంచ్ లు వేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ఎన్నికల ప్రచారంలో చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ క్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ఏదో యుద్ధంలో గెల్చి నట్లు ఫీల్ అవుతున్నాడని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే సంక్షేమ పథకాలను కట్ చేస్తా అని ఓటర్లను బెదిరిస్తున్నాడన్నారు.ఎన్నికల ప్రచారంలో నోటికి ఎంతొస్తే అంత మాటలు మాట్లాడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలు నెరవేర్చలేదన్నారు. అదే విధంగా మూడు ఫీట్ల మనిషివి నువ్వెంత ప్రజలు ఎన్టీఆర్ అంతని గొప్ప నేతను సైతం ఓడించరి గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి బెదిరింపులకు.. ఓటర్లు భయపడే రోజులు లేవన్నారు. అంతే కాకుండా సీఎం రేవంత్ రెడ్డి తోక కట్ చేసి ప్రజుల ఇంట్లో కూర్చుండబెడతారంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బంజారాహిల్స్ లో తమ పార్టీ తరుపున గెలిచిన కార్పొరేటర్‌ను మేయర్ చేశామని.. ఆమెకు ఏమైందో ఏమో కాంగ్రెస్ లోకి వెళ్ళిపోయిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో ప్రస్తుతం “ఆహా నా పెళ్ళంట సినిమా కథ” లాగానే ఉందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన పలువరు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. అర చేతిలో వైకుంఠం చూపించి అధికారం లోకి వచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ రెండేళ్ల లో ఏమన్నా జరిగింది అంటే మహిళలకు ఇచ్చే ఫ్రీ బస్సు మాత్రమే అన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు అని.. మగవాళ్ళ దగ్గర ఎక్కువ డబ్బులు గుంజు తున్నారని తెలిపారు. నిన్న సీఎం జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.. ఆయన ఓటర్లను బెదిరిస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి చక్రవర్తి లాగా ఫీల్ అవుతున్నారు.. ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశాం.. ఇలాంటి సీఎంని ఎప్పుడూ చూడలేదని విమర్శించారు. మాగంటి గోపీనాథ్ ఎన్టీఆర్ అభిమాని. మాగంటి గోపీనాథ్ ఆకాల మరణం చెందితే వచ్చిన ఎన్నిక ఇదని గుర్తు చేశారు.. తమ పార్టీ గోపీనాథ్ భార్యకు టికెట్ ఇచ్చిందని.. ప్రచారంలో ఆమె గోపీనాథ్ గుర్తు వచ్చి ఏడిస్తే మంత్రులు అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు.

## తడసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి



**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జాంగిర్**

**చౌటుప్పల, విశాలభారతి:**

మండలంలోని మండల వ్యాప్తంగా సొసైటీ,ఐకేపీ కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి,వానకాలం వరి ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు తక్షణం చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జాంగిర్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేసినారు.శనివారం రోజున కందాల రంగారెడ్డి స్మారక భవనం నందు చౌటుప్పల మండల కమిటీ సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి ఎండి జాంగిర్ ముఖ్య అతిథిగా హాజరై తదనంతరం వారు మాట్లాడుతూ మండలంలో రైతులు గత 25 రోజులుగా తాము పండించిన ధాన్యాన్ని తీసుకు వచ్చి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను నామమాత్రంగా ప్రారంభించి,ప్రభుత్వము వివక్ష చూపుతోందని అన్నారు.ప్రభుత్వం తక్షణమే మార్కెట్లో ఉన్న ధాన్యాన్ని పరిమితి లేకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.మండల వ్యాప్తంగా కాల్వలు,చెరువులు,బావులు,బోర్ల కింద నాటు పెట్టి కోతలు కోసి కోసిన వరి ధాన్యాన్ని ఆయా ఐకేపీ,సొసైటీ కేంద్రాలలో వరి ధాన్యము రాశులు పోసినా ప్రభుత్వము ఎందుకు కొనుగోలు చేస్తలేరని వారు ప్రశ్నించారు.సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి మండల కార్యదర్శి గంగాదేవి సైదులు మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి,చింతల సుదర్శన్, బోయ యాదయ్య మండల కమిటీ సభ్యులు,అంతటి అశోక్,పొట్ట శ్రీను,జక్కిడి దేవేందర్ రెడ్డి,బోదాస్ వెంకటేష్,కొండే శ్రీశైలం,చెరుకు లక్ష్మమ్మ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు డిపాజిట్ రాకూడదు

- బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం
- షేక్‌పేట్‌రోడ్ షో నిర్వహించిన కేటీఆర్
- ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు
- మాగంటి సునీత గెలుపొందడం ఖాయమన్నారు
- మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- 4కోట్ల మంది గోస తీర్చే అవకాశం వచ్చింది
- గేదెలు మృత్యువాత పడితే రూ.50వేలు
- నాలాలపై కబ్జాలను తొలగించాల్సిందేనని అన్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. సిట్టింగ్ స్థానమైన జూబ్లీహిల్స్‌ను తిరిగి కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే అందుకు అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటుంది. అన్ని రాజకీయ పార్టీల కంటే వ్యూహాత్మంగా అభ్యర్థిని తొలుత ప్రకటించిన బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలోనూ వేగం పెంచింది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణిని అభ్యర్థిగా ప్రకటించింది. ఆమెపై ఉన్న సానుభూతి వర్కౌట్ అవుతుందని కూడా పార్టీ నాయకత్వం భావించింది. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీకి ధీటుగా బీఆర్ఎస్ ఎన్నికల వ్యూహరచన చేస్తోంది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా రోడ్ షోలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభించారు. ఇవాళ్టి నుంచి




జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో రోడ్ షోలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభించారు.నవంబర్ 9 వరకు రోడ్ షోలు, బైక్ ర్యాలీలు నిర్వహించనున్నారు కేటీఆర్. తొలిరోజు షేక్‌పేట్ రోడ్ షోలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపొందడం ఖాయం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని షేక్‌పేట్‌లో కేటీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలుపు పక్కా. మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు.కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే కరెంట్ సమస్య పరిష్కారమైంది అని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో 42 ఫ్లైఓవర్లు నిర్మించాం అని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. ‘అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారు. కేసీఆర్ పథకాలను కొనసాగించే తెలివి వీళ్లకు లేదు’అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్‌రూమ్‌లు కట్టించాం... కాంగ్రెస్ వచ్చాక ఒక్క ఇల్లు కట్టారా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఇళ్లను కూలగొట్టడమే ఇందిరమ్మ రాజ్యమా అని నిలదీశారు. పేదల ఇళ్లను హైడ్రా కూల్చివేసింది. పేదల శాపాలు కాంగ్రెస్‌కు ఉరితాడులా చుట్టుకుంటాయి అని హెచ్చరించారు.రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నాశనం చేశారు. తెలంగాణ నుంచి పరిశ్రమలు పారిపోతున్నాయి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు.

నాలుగు లక్షల మంది జూబ్లీహిల్స్ ఓటర్లకు 4 కోట్ల మంది తెలంగాణ ప్రజల గోస తీర్చే అవకాశం మీ చేతికి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి రోత మాటలు, పనికిమాలిన భాష మాట్లాడుతున్నాడు. హామీలపై ప్రజలు నిలదీస్తే వారిని దబాయిస్తూ మీరు నన్ను ఏం చేస్తారు కోసుకు తింటారా... కొడుతారా..? అని హుంకరిస్తున్నరు అని కేటీఆర్ మండిపడ్డారు. ఇది కుటుంబ పెద్దకు ఉండాల్సిన లక్షణమా..? అని కేటీఆర్ నిలదీశారు. ఎన్నికలు వస్తాయి.. పోతాయి కానీ 4 లక్షల మంది జూబ్లీహిల్స్ ఓటర్లకు 4 కోట్ల తెలంగాణ ప్రజల గోస తీర్చే అవకాశం మీ చేతికి వచ్చింది అని చెప్పుకొచ్చారు. మీరు జూబ్లీహిల్స్‌లో గట్టి తీర్పు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ డిపాజిట్ జప్తు చేస్తే ఖచ్చితంగా 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుంది అని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాల్సిన పథకాలన్నీ బ్రహ్మాండంగా ప్రజలకు అందుతాయి. కాంగ్రెస్ డిపాజిట్ గల్లంతు కావాలి. పెన్షన్లు, తులం బంగారం, స్కూటీలు, 2500 రావాలంటే కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించండి’అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# ట్రై సిటీ సో పిటీ..!

( మొదటిపేజీ తరువాయి )

నగరవాసులకు కనుకు లేకుండా చేస్తోంది. ఎప్పుడు వర్షమొచ్చినా సరే.. త్రినగరిలో ముంపు విలయమే కనిపిస్తోంది. వరంగల్ మొత్తం స్తంభించి పోతోంది. మొన్న వచ్చిన మొంథా తుపాను దెబ్బకు.. గ్రేటర్ వరంగల్ అంతా చెరువైంది. ఏ రోడ్డులో చూసినా నీళ్లే ఉన్నాయ్. ఏ కాలనీ వైపు కన్నెత్తినా.. ముంపులోనే కనిపించింది. వాహనాలు తిరగాల్సిన రోడ్లమీదకి పడవలొచ్చాయ్. భారీ వర్షం కురుస్తాయనే వాతావరణ శాఖ అలర్ట్ ఎప్పుడొచ్చినా.. వరంగల్ గుండెల్లో దడ మొదలవుతోంది. వాన జల్లు వస్తే చాలు.. ఓరుగల్లు ఒళ్లు జలదరిస్తోంది.

గడిచిన ఐదేళ్లలో.. భారీ వర్షాలు ఎప్పుడొచ్చినా.. వరంగల్ నగరంలోని లోతట్టు ప్రాంతాలు, అనేక కాలనీలు తరచుగా వరదలకు గురవుతున్నాయ్. 2021 నుంచి ఇప్పటివరకు.. ప్రతి సంవత్సరం.. కనీసం ఒక్కసారైనా వరంగల్ తీవ్రమైన వరదలకు ప్రభావితమైంది. గడిచిన ఐదేళ్లలో.. ఐదుసార్ల కంటే ఎక్కువే.. వరంగల్‌లో వరదలు వచ్చాయ్. పెద్ద ఎత్తున నష్టాన్ని కలిగించాయ్. ప్రతి ఏడాది.. వర్షాకాలంలో వరంగల్‌లో వరదలు కామనైపోయాయ్. అనేక కాలనీలు నీట మునగడం, ఇళ్లలోకి బురద చేరడం లాంటి సీన్లు తరచుగా కనిపిస్తున్నాయ్. ఇక.. భారీ తుఫానులు, కుండపోత వర్షాల సమయంలో.. వరంగల్‌లో పరిస్థితులు మరీ దారుణంగా ఉంటున్నాయ్. లోతట్టు ప్రాంతాలు, కాలనీలు నీట మునగడం సాధారణమైపోయింది. 2023లో వరంగల్‌లో రికార్డు స్థాయిలో వర్షాలు కురిశాయ్. దాంతో.. అనేక ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయ్. ఈ ఏడాది ఆగస్టులోనూ.. భారీ వర్షాలకు వరంగల్, హన్మకొండ, కాజీపేట నగరాల్లోని అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయ్. ఇటీవల వచ్చిన మొంథా తుపాను కూడా వరంగల్‌ని ముంచేసింది.

భారీ వర్షాలు, తుపానుల సమయంలో.. వరంగల్



మునిగిపోయేందుకు, తరచుగా వరదలు వచ్చేందుకు అనేక కారణాలున్నాయ్. ఒక్కరోజులోనే.. 15 సెంటీమీటర్లు, అంతకంటే ఎక్కువ వర్షం కురిసిందంటే.. వరంగల్ పనైపోయినట్లే అనే చర్చ జరుగుతోంది. హన్మకొండ నడిబొడ్డున ఉన్న గోకుల్ నగర్.. చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతోంది. అదేవిధంగా.. శాంతినగర్, అశోక్ నగర్, శ్రీనివాస కాలనీ, విద్యానగర్ ప్రాంతాలు చెరువుల్లా మారిపోతున్నాయ్. ఆదాలత్, సుబేదారి, వడ్డేపల్లి ఏరియా నుంచి వస్తున్న వరద నీరు.. గోకుల్ నగర్‌ని ముంచెత్తుతోంది. ఓ గంటపాటు గట్టిగా వర్షం కురిస్తే చాలు.. ఇళ్లలోకి నీరు చేరి.. వరద బీభత్సం సృష్టిస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో.. నీరంతా రోడ్ల మీదకొస్తోంది. వడ్డేపల్లి నుంచి వచ్చే వరద.. స్నేహనగర్, వికాస్ కాలనీ, అశోక కాలనీ మీదుగా.. గోకుల్ నగర్‌కే చేరుతోంది. వడ్డేపల్లి నుంచి వచ్చే వరదను.. వికాస్ నగర్ నుంచి.. డ్రైనేజీ నిర్మించి నయీంనగర్ నాలాలోకి మళ్లిస్తే.. సమస్య సగం తీరేది. అశోక కాలనీలో డ్రైనేజీ సిస్టమ్ సరిగా లేకపోవడంతో.. ఆ ప్రాంతమంతా ముంపునకు గురవుతోంది. అనేక కాలనీల్లో నాలాల మార్గం కబ్జాలకు గురవడంతో.. వర్షపు నీరంతా.. ఇళ్ల మధ్యే ఆగిపోతోంది.

భద్రకాళి చెరువు పరిసర ప్రాంతాలు కూడా తరచుగా ముంపునకు గురవుతున్నాయ్. ఎన్టీఆర్ నగర్, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీ, చిన్నవడ్డేపల్లి చెరువు పరిసరాల్లో ఉన్న ఎస్ఆర్ నగర్, సాయి గణేశ్ కాలనీ, శివనగర్ అండర్ రైల్వే బ్రిడ్జి, లక్ష్మిగణపతి కాలనీ, మైసయ్య నగర్, డీకే నగర్ ప్రాంతాల్లో.. చిన్నపాటి వర్షానికే రోడ్లపై మోకాళ్ల లోతు నీరు నిలుస్తోంది. ఇక.. కుండపోత వానలు కురిస్తే.. ఇక్కడ ఇబ్బందులు చెప్పతరం కాదు. వరద నీళ్లు ఇళ్లలోకి చేరి.. జలదిగ్బంధంలో చిక్కుకుపోతున్నాయ్. వరంగల్ నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడమే.. ఈ వరదలకు కారణమవుతోంది. ఇప్పటికే ఉన్న డ్రైనేజీలు పాతబడి, ఇరుకుగా ఉండటంతో.. చిన్న వర్షానికి పొంగిపొర్లుతున్నాయ్. గ్రేటర్ వరంగల్ సిటీ వేగంగా విస్తరించడం, కాలనీలు పెరగడం వల్ల.. వర్షపు నీరు సహజంగా ప్రవహించే కాలువలు, వాగులు, చెరువులున్న ప్రాంతాలు ఆక్రమణలకు గురికావడంతో.. నీరు సాఫీగా వెళ్లే మార్గం లేక.. కాలనీల్లోకి చేరుతోంది. ఇలా.. వర్షాకాలంలో వరద ముంపు సీన్లు వరంగల్‌లో కామనైపోయింది. వరంగల్ పేరు వింటే.. కాకతీయుల వైభవం గుర్తొస్తుంది. తెలంగాణ సంస్కృతి కనిపిస్తుంది. అలాంటి ఓరుగల్లుకు కావాల్సింది.. కేవలం తాత్కాలిక ఉపశమనమేనా? నగరాన్ని ముంచే ఈ వరదలకు.. శాశ్వత పరిష్కారమే లేదా? రెండో రాజధాని అనే కీర్తి, ప్రఖ్యాతలు.. పిలుపులకే పరిమితమా? వరదగల్లుగా మారిన ఓరుగల్లు.. ఇంకెప్పుడు హైదరాబాద్ స్థాయికి ఎదుగుతుంది? గ్రేటర్ వరంగల్‌ని.. గ్రేట్ వరంగల్‌గా చేసేందుకు.. అధికారులు, పాలకులు, ప్రభుత్వం చేయాల్సిందేమిటి? హైదరాబాద్, సికింద్రాబాద్ కలిస్తేనే.. ఓ మహా నగరం ఆవిష్కృతమైంది. గ్లోబల్ సిటీగా ఎదిగే దిశగా దూసుకెళ్తోంది. అలాంటిది.. వరంగల్ ట్రైసిటీ. కాజీపేట, హన్మకొండ, వరంగల్ కలిసి ఉన్న అరుదైన మహానగరం. ఇప్పటికే.. వరంగల్ అభివృద్ధిలో ఎంతో ముందుకెళ్లాల్సి ఉంది. కానీ.. ఓరుగల్లు కేవలం తెలంగాణ రెండో రాజధాని అనే పిలుపు దగ్గరే ఆగిపోయింది. హైదరాబాద్ తర్వాత.. రెండో రాజధానిగా పరిగణించే నగరం ఎలా ఉండాలి? కానీ.. ఇప్పుడెలా ఉంది? జస్ట్.. ఓ కుండపోత వాన కురిస్తే చాలు.. వరంగల్ మీదున్న లెక్కలన్నీ మారిపోతాయ్. ఆ లోతట్టు ప్రాంతాలను, రోడ్లపై ప్రవహించే వరదనీటిని చూస్తే చాలు.. కాకతీయుల నగరిపై ఉన్న ఆశలన్నీ ఆ నీటిలోనే మునిగిపోతాయ్.

విశాల భారతి Real Talk
రియల్ టాక్
vishalabharati Telugu Daily
విశాల భారతి
www.vishalabharati.com
epaper.vishalabharati.com
ఆదివారం, హైదరాబాద్
2 నవంబర్ 2025


### అఫర్డబుల్ సెగ్మెంట్ స్లో డౌన్

అయితే రియల్ ఎస్టేట్ మొత్తం రంగం సమానంగా వృద్ధి చెందడం లేదు. అఫర్డబుల్ సెగ్మెంట్ (₹40 లక్షల లోపు ఇళ్లు)లో అమ్మకాలు కొంత మందగించాయి. హైదరాబాద్‌లో ఈ సెగ్మెంట్‌లో 9 శాతం అధికంగా అన్‌సోల్డ్ ఇన్వెంటరీ ఉందని నివేదికలు చెబుతున్నాయి. దీనికి కారణాలు నిర్మాణ వ్యయాలు పెరగడం, భూమి ధరలు అధికం కావడం, మధ్య తరగతి కొనుగోలుదారులు బ్యాంక్ వడ్డీ రేట్లతో జాగ్రత్తగా వ్యవహరించడం వంటివి. 2025 రెండో త్రైమాసికంలో కొత్త ప్రాజెక్టుల లాంచింగ్ 30 శాతం తగ్గడం కూడా దీని సంకేతమే.

### ఊతమిస్తున్నా ప్రభుత్వ చర్యలు

తెలంగాణ ప్రభుత్వం కూడా రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించేందుకు పలు నిర్ణయాలు తీసుకుంది. స్టాంప్ డ్యూటీ తగ్గించడం, ప్రాజెక్ట్ అప్రూవల్ ప్రక్రియను వేగవంతం చేయడం, పారదర్శక వ్యవస్థల ద్వారా అనుమతులు త్వరగా ఇవ్వడం వంటివి రంగం వృద్ధికి దోహదం చేస్తున్నాయి. అదేవిధంగా అఫర్డబుల్ హౌసింగ్ రియల్ ఎస్టేట్ రేగ్యులేటరీ (RERA) చట్టం కట్టుదిట్టమైన అమలుతో మార్కెట్‌లో విశ్వసనీయత పెరిగింది.





# ప్రీమియం ఇళ్లకు గోల్డెన్ డేస్

## ధరలు 12% పెరుగుదల
## హైదరాబాద్ రియల్ ఎస్టేట్ 2025 డిమాండ్

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ మరోసారి బలమైన వృద్ధిని నమోదు చేస్తోంది. దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ మందగమనంలో ఉన్నప్పటికీ, హైదరాబాద్ మాత్రం తనదైన గమనం కొనసాగిస్తోంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ పోర్టల్స్, విశ్లేషణ సంస్థల తాజా నివేదికల ప్రకారం, 2024తో పోలిస్తే 2025లో నగరంలోని నివాస గృహాల ధరలు సగటున 8 నుంచి 12 శాతం పెరిగాయి. ఇది దేశంలోని ప్రధాన మెట్రో నగరాల కంటే అధిక వృద్ధి రేటుగా నిలిచింది.



### భవిష్యత్తు దిశగా మార్కెట్

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వృద్ధి 2026లో కూడా కొనసాగనుందని నిపుణులు భావిస్తున్నారు. కొత్త ఉద్యోగ అవకాశాలు, విస్తరిస్తున్న ఐటీ క్యాంపసులు, మెరుగైన రవాణా సదుపాయాలు, సురక్షిత పెట్టుబడుల వాతావరణం నగర మార్కెట్‌ను ముందుకు నడిపించనున్నాయి. ఇన్వెస్టర్లకు, NRIsకి హైదరాబాద్ ఇప్పటికీ భారతదేశంలో అత్యంత స్థిరమైన రియల్ ఎస్టేట్ మార్కెట్గా నిలుస్తోంది. ప్రీమియం హౌసింగ్ డిమాండ్ పెరుగుతూనే ఉండగా, స్మార్ట్ టౌన్‌షిప్‌లు, గ్రీన్ కమ్యూనిటీలు, క్లౌడ్ బేస్డ్ సెక్యూరిటీ ప్రాజెక్టులు భవిష్యత్తు రియల్ ఎస్టేట్ దిశగా దారితీస్తున్నాయి. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఇప్పుడు కేవలం నివాస అవసరం మాత్రమే కాదు — ప్రతిష్ఠ, పెట్టుబడి, స్థిరత్వం కలయిక. నగర వృద్ధి రేటు, ఇన్ఫ్రాస్ట్రక్చర్, మరియు బలమైన కొనుగోలు శక్తి కలయిక మార్కెట్‌ను కొత్త ఎత్తులకు తీసుకెళ్తోంది. ఈ దశలో ఇంటి కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది సరైన సమయం. విశ్వసనీయ డెవలపర్లు, సక్రమ లొకేషన్లు, మరియు మార్కెట్ ఫండమెంటల్స్ బలంగా ఉన్నందున, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వృద్ధి ఇంకా రెండు సంవత్సరాలు కొనసాగుతుందని పరిశ్రమ నిపుణుల అంచనా.



### ప్రీమియం హౌసింగ్ డిమాండ్

2025లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను నడిపిస్తున్న ప్రధాన శక్తి ప్రీమియం సెగ్మెంట్ రూ.1.5 కోట్లకు పైగా విలువగల ఇళ్లకు భారీగా డిమాండ్ ఉంది. తాజా గణాంకాల ప్రకారం, నగరంలో జరిగిన మొత్తం అమ్మకాలలో 49 శాతం ఈ సెగ్మెంట్‌లోనే నమోదయ్యాయి. గచ్చిబౌలి, కొండాపూర్, కోకపేట్, నానకరాం గూడా, నల్లగండ్ల, రాజేంద్రనగర్ వంటి ఐటీ కారిడార్ పరిసర ప్రాంతాల్లో ఉన్న విల్లాలు, హైరైజ్ అపార్ట్మెంట్లు అత్యధికంగా అమ్ముడవుతున్నాయి. హైదరాబాద్‌లో పనిచేస్తున్న HNIలు, IT ప్రొఫెషనల్స్, NRIs ఈ ప్రీమియం ఇళ్లపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. పెరుగుతున్న ఉద్యోగావకాశాలు, స్థిరమైన వేతనాలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి వంటి అంశాలు దీనికి ఊతమిచ్చాయి.

### మార్కెట్ హైలైట్స్

గత నాలుగేళ్లలో 80 శాతం రేట్లు పెరిగిన నగరంగా హైదరాబాద్ దేశవ్యాప్తంగా అగ్రస్థానంలో ఉంది. ఈ వృద్ధి రేటు ఢిల్లీ, ముంబయి, బెంగళూరు వంటి ప్రధాన నగరాలను అధిగమించింది. గోద్రేజ్ ప్రాపర్టీస్, రాజపుష్ప, ASBL, My Home, Prestige, Aparna వంటి ప్రధాన డెవలపర్లు ఈ సంవత్సరంలో భారీ అమ్మకాలను నమోదు చేశారు. ఉదాహరణకు, గోద్రేజ్ ప్రాపర్టీస్ సంస్థ కేవలం ఒక నెలలోనే రూ 1,000 కోట్ల విలువైన 683 యూనిట్లను విక్రయించింది. అదే సమయంలో ASBL కంపెనీ "భారతదేశంలో వేగంగా ఎదుగుతున్న రియల్ ఎస్టేట్ కంపెనీ"గా గుర్తింపు పొందింది. నెలరోజుల వ్యవధిలోనే 5,900 కంటే ఎక్కువ ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు జరగడం, మార్కెట్ దృఢత్వాన్ని సూచిస్తుంది. గేటెడ్ కమ్యూనిటీలు, క్లబ్ హౌస్ ఫెసిలిటీలు, స్మార్ట్ సెక్యూరిటీ సిస్టమ్స్ కలిగిన ప్రాజెక్టులకు ప్రజలు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు.

### ఇన్‌ఫ్రా డ్రైవ్

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వృద్ధికి వెన్నెముకగా నిలుస్తున్నది నగరంలోని ఇన్‌ఫ్రా విస్తరణ. మెట్రో రైలు 2వ దశ విస్తరణ, ఔటర్ రింగ్ రోడ్ (ORR) కనెక్టివిటీ, కొత్త రీజినల్ రింగ్ రోడ్ (RRR)ప్రాజెక్టు వంటి అంశాలు నగర పరిధిని వేగంగా విస్తరిస్తున్నాయి. ఈ ప్రాజెక్టుల ప్రభావంతో షంషాబాద్, చెవెల్ల, తుర్కయంపల్లి, మోకిల వంటి పూర్వపు పల్లె ప్రాంతాలు ఇప్పుడు ప్రీమియం లొకేషన్లుగా మారుతున్నాయి. మియాపూర్ నుంచి పటాన్‌చెరు, గచ్చిబౌలి నుంచి తెల్లపూర్, కొండాపూర్ నుంచి నల్లగండ్ల వరకు మెట్రో ప్రాజెక్టులు విస్తరించడంతో ఆ ప్రాంతాల్లో ప్రాపర్టీ ధరలు పెరుగుతున్నాయి.

### పెట్టుబడులకు హాట్‌స్పాట్స్

2025లో హైదరాబాద్‌లో అత్యధిక డిమాండ్ ఉన్న ప్రాంతాలు గచ్చిబౌలి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, కోకపేట్, రాజేంద్ర నగర్, మోకిల, నానకరాంగూడ వీటిలో ప్రతి ప్రాంతం ప్రత్యేక లక్షణాలతో కొనుగోలుదారులను ఆకర్షిస్తోంది. గచ్చిబౌలి – ఐటీ హబ్ సమీపం, హై-రైజ్ లైఫ్‌స్టైల్ ప్రాజెక్టులు ఉండగా, కోకపేట్ – కొత్త ఎక్స్‌ప్రెస్ వే కనెక్టివిటీతో విల్లా మార్కెట్ వేగంగా ఎదుగుతోంది.

రాజేంద్రనగర్ – ఎయిర్‌పోర్ట్ యాక్సెస్, RRR లింక్ కారణంగా కొత్త అభివృద్ధి కేంద్రంగా మారింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
హైదరాబాద్
ఆదివారం
2 నవంబర్ 2023
CINEMA

# నూతన దర్శకుడితో విక్రమ్ 63



హీరో చియాన్ విక్రమ్ మరో కొత్త దర్శకుడికి అవకాశం ఇచ్చారు. ఇప్పటివరకు కేవలం మూడు లఘు చిత్రాలను మాత్రమే రూపొందించిన బోడి కె. రాజ్‌కుమార్ దర్శకత్వంలో నటించేందుకు చియాన్ అంగీకరించారు. నిరంతరం కొత్తదనం కోసం పరితపించే ఆయన తన 63వ చిత్రానికి దర్శకత్వ బాధ్యతలను డెబ్యూ డైరెక్టర్‌కు అప్పగించడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టును శాంతి టాకీస్ నిర్మించనుంది.విక్రమ్ చివరగా 'వీర ధీర శూరన్' చిత్రంలో నటించారు. 63 చిత్రాన్ని 'మండేలా' ఫేం మడోన్ అశ్విన్ ప్రారంభించారు. కొద్ది రోజులపాటు చిత్రీకరణ కూడా జరిగినట్టు కోలీవుడ్ వరాల సమాచారం. చివరకు ఏమైందో గానీ ఈ ప్రాజెక్టు అర్థాంతరంగా నిలిచిపోయింది. ఇపుడు ఈ ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కనుంది. బోడి కె.రాజ్‌కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వ బాధ్యతలు స్వీకరించారు.

# రామ్ చరణ్ 'పెద్ది' నుంచి జాన్వీ కపూర్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం శ్రీలంకలో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో జాన్వీ అచ్చియమ్మా అనే పాత్రలో కనిపించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో జాన్వీ క్రికెట్ కామెంటేటర్‌గా కనిపించనుంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 మార్చి 27న విడుదల కానుంది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో రామ్ చరణ్‌తో పాటు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు సినిమాటోగ్రఫీ, కొల్లా అవినాష్ ఆర్ట్ డైరెక్షన్, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జగపతిబాబు, దివ్యేందు భట్టాచార్య వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.





# ఉస్తాద్ భగత్ సింగ్.. ఇయర్ ఎండ్ బ్లాస్ట్..!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్స్‌గా దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అవైటెడ్ మాస్ ఎంటర్టైనర్ చిత్రం "మాస్ జాతర" కోసం అందరికీ తెలిసిందే. మంచి హైప్ ని సొంతం చేసుకున్న ఈ సినిమా దాదాపు పూర్తవుతుంది. అయితే ఈ సినిమాపై ఓ సాలిడ్ బజ్ ఇపుడు వినిపిస్తోంది.దీని ప్రకారం మేకర్స్ ఈ ఏడాదికి ముగింపుగా ఉస్తాద్ భగత్ సింగ్ మ్యూజికల్ బ్లాస్ట్ తో ముగించనున్నారని వినిపిస్తోంది. అంటే సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ అందించిన ఫస్ట్ సింగిల్ ని డిసెంబర్ 31న మేకర్స్ విడుదల చేయాలని ఫిక్స్ చేశారట. సో ఏడాది ఎండింగ్ కి మాత్రం ఉస్తాద్ భగత్ సింగ్ బీట్స్ తో మోగిపోతుంది అని చెప్పాలి. ఇక దీనిపై అధికారిక క్లారిటీ బయటకు రావాల్సి ఉంది.



# రామ్ పోతినేని ఆంధ్ర కింగ్ తాలూకా ..?

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా వస్తున్న 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంపై అంచనాలు భారీగా నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నెలాఖరున థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్న ఈ సినిమా నిర్మాణానంతర పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాతలు తాజాగా సినిమా విడుదల తేదీని ఒక రోజు ముందుకు జరిపేందుకు ఆలోచిస్తున్నట్లు సమాచారం.నిర్మాతలు మొదట ప్రకటించిన ప్రకారం ఈ చిత్రం నవంబర్ 28న ప్రపంచవ్యాప్తంగా విడుదల కావాల్సి ఉంది. అయితే తాజా సమాచారం ప్రకారం ఒక రోజు ముందుగానే (నవంబర్ 27న) ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. రామ్ అభిమానులు మాత్రం ఈ అప్‌డేట్‌పై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ సినిమా నుంచి థర్డ్ సింగిల్ 'చిన్ని గుండెలో' అనే మెలోడీని మేకర్స్ విడుదల చేయగా.. ఈ పాట ప్రస్తుతం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తుండగా..పి. మహేశ్‌బాబు ('మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్) దర్శకత్వం వహిస్తున్నాడు.



# నిన్నొదిలి కాసేపైనా ఉంటానా..

వినూత్న కథా చిత్రాలతో మెప్పించే అల్లరి నరేష్ తాజాగా యాక్షన్ థ్రిల్లర్ '12ఏ రైల్వే కాలనీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు. నాని కాసరగడ్డ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. 'పొలిమేర' సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలో ఈ చిత్రం విడుదలకానుంది. శుక్రవారం మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుట్టారు. 'కన్నొదిలి కలనొదిలి..' అనే పాటను విడుదల చేశారు.'కన్నొదిలి కలనొదిలి కనుపాపే ఉంటుందా..నిన్నొదిలి నేకదిలి కాసేపైనా ఉంటానా..' అంటూ చక్కటి భావాలతో ఈ పాట ఆకట్టుకుంది. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటను హేషమ్ అబ్దుల్ వహాబ్ ఆలపించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.